# నాని

బియ్యంలో రాళ్లు ఏరుతున్న రమణమ్మ చటుక్కున ఏదో గుర్తు వచ్చినట్లు తలెత్తి బల్లమీదున్న గడియారం వంక చూసింది. ఎనిమిదింటికి ఇంకా పదినిమిషాలుంది.

"నానీ" కేక వేసింది రమణమ్మ.

"ఏమిటమ్మా" అంటూ పక్క గదిలోంచి బయటకు వచ్చాడు నాని.

"ఇంకా బడికి వెళ్ళలేదేమిట్రా?"

నాని తల్లి దగ్గరకు వచ్చి, "నా ఎక్కాల పుస్తకం కనిపించటం లేదమ్మా" అన్నాడు మెల్లగా.

"ఎక్కడ పెట్టావు?"

భుజానికున్న సంచి తీసి తల్లి ముందుంచి, "ఈ సంచిలోనే పెట్టానమ్మా" అన్నాడు.

"వెధవకొంప. పెట్టిన వస్తువు పెట్టిన చోటు ఉండదు కదా. అందరూ అన్నీ సర్దేవాళ్ళే. అసలు ఈ సంచిలోనే పెట్టావో లేదో?"

"ఈ సంచిలోనే పెట్టానమ్మా నిన్న. ఈ ఉదయం చూస్తే లేదు" అంటూ సంచిలోని పుస్తకాలు నేలమీద వేసి ఒక్కొక్కటే తీసి తల్లికి చూపించాడు.

నిజానికి నాని ఎక్కాల పుస్తకం పోలేదు. నిన్న సాయంత్రం మస్తాన్ దగ్గర దాచాడు. ఎక్కాల పుస్తకం పోయిందని చెప్పి తల్లి దగ్గర డబ్బులు తీసుకుందామనే ఎత్తులో ఉన్నాడు.

ఇంతలో బయట నుండి బాబ్జీ వేసిన ఈల వినిపించింది. గబగబ పుస్తకాలు సంచిలో పెట్టుకుని బయటకు పరుగెత్తాడు. ఇంటి బయట మస్తాన్, బాబ్జి ఉన్నారు. "ఆలస్యం ఏమిట్రా, త్వరగా వచ్చేయి" అన్నాడు మస్తాన్.

"మా అమ్మ ఇంకా డబ్బులివ్వలేదురా."

"ఇస్తుందా?"

"ఇస్తుంది. తీసుకుని వచ్చేస్తాను."

"పావలాకు తక్కువ తెచ్చావా నీచెత్త రేగుతుంది" అన్నాడు బాబ్జి.

"పావలాకు తక్కువ తేనని నిన్న చెప్పాను కదరా" అని ఇంట్లోకి వచ్చి తల్లి ఎదురుగా కూర్చుని, "ఎక్కాల పుస్తకమమ్మా" అన్నాడు బతిమలాడుతూ.

"పోతే నన్నేం చేయమంటావురా?" కసురుకుంది.

"పుస్తకం లేకపోతే మాస్టారు ఊరుకోరమ్మా."

"కొత్తది కొనటానికి డబ్బులెక్కడివిరా?"

"ఇవేళ బడి మానేసేదా?"

"ఈ సంగతి నాన్నకు తెలిస్తే ఊరుకుంటారేమిటి? చెప్పనా?"

"వద్దమ్మా, పావలా ఇవ్వు."

"పావలా దేనికి?"

"ఎక్కాల పుస్తకానికి."

"ఎక్కాల పుస్తకం పదిహేను పైసలే కదరా?"

"పదిహేను పైసల పుస్తకాలు రావటం లేదమ్మా."

"నా దగ్గిర డబ్బుల్లేవు."

"నాన్న నడుగు."

"నాన్న ఇంకా నిద్రలేవలేదు."

"అమ్మా, ఎట్లానే?" మారాం చేశాడు.

అంతలో బయట నుండి ఈల వేసిన చప్పుడు వినిపించేసరికి "మా క్లాసు పిల్లలు పిలుస్తున్నారు" అన్నాడు.

రమణమ్మ విసుక్కుంటూ లేచి లోపలికి వెళ్లి వంకీకి తగిలించి ఉన్న భర్త చొక్కా జేబులోంచి పావలా తీసి తీసుకొచ్చి నానికిచ్చింది. నాని ఆనందంతో నిక్కరు జేబులో పెట్టుకుని సంచి భుజాన వేసుకుని "వెళ్ళొస్తానమ్మా" అని బయటకు వస్తోంటే, "సాయంత్రం నాకు కొన్న కొత్త ఎక్కాల పుస్తకం చూపించక పోయావో ఇంకేమీలేదు" అంది రమణమ్మ. నాని నవ్వుకుంటూ "సరే సరే" అని పరుగెత్తుకుంటూ వచ్చి మస్తాన్, బాబ్జీలను కలుసుకున్నాడు.

ముగ్గురూ నడవసాగారు.

"పావలా ఏది?" అడిగాడు మస్తాన్.

"తెచ్చాను. తర్వాత ఇస్తాను లేరా" అన్నాడు నాని.

"ముందు చేతిలో పెట్టు."

జేబులోంచి పావలా తీసి మస్తాన్ చేతిలో పెడుతోంటే నానికి చాలా బాధ వేసింది. పావలా ఇవ్వకపోతే తనను వాళ్లతో కలవనీయరు. వాళ్ళతో ఆడుకోనీయరు. దూరంగా పెడతారు. కజ్జాలు పెట్టుకుంటారు. మస్తాన్‌కి చాలా ఆటలు వచ్చు. హైస్కూలు పిల్లలతోనే కబాడీ ఆడుతుంటాడు. మాస్టార్లు కూడా వాడినేమీ అనరు. ఆ పావలా తన దగ్గిరుంటేనా, బడి దగ్గర కొట్లో నాలుగు జీళ్ళు, పన్నెండు జంతికలు కొనుక్కునేవాడు. ప్చ్. వీడు కొట్టేశాడు.

"నా ఎక్కాల పుస్తకం ఏది?" హఠాత్తుగా గుర్తు వచ్చి అడిగాడు నాని.

"ఇంట్లో ఉంది. సాయంత్రం మా ఇంటికొచ్చి తీసుకెళ్ళు" అన్నాడు మస్తాన్.

"నానీ, రేయ్, నువ్వు మేం చెప్పినట్లు వినాలి. వినకపోతే నిన్ను మా పార్టీ లోంచి లాగేస్తాం, పూర్తి కటీఫ్" అన్నాడు బాబ్జి. మస్తాన్‌కు బాబ్జీ తందానతాన.

"వింటాన్లేరా."

వాళ్ల పార్టీలో చేరటానికే నానికి ఇష్టంగా ఉంది. మస్తాన్, బాబ్జీ కరుకుగా మాట్లాడినా మంచివాళ్ళు అనుకున్నాడు నాని. వాళ్లిద్దరు బడికి సరిగారారు. హోంవర్కు చేయరు. ఎక్కాలు అప్పచెప్పరు. పాఠాలు చదవరు. రోజూ వాళ్ల ఇళ్లల్లో బడికని చెప్పి బయల్దేరి స్టేషనుకు దగ్గిరగా ఉన్న మఱ్ఱిచెట్టు కిందకు చేరి ఏ బిళ్ళంగోడో, గోలీ లాటో, బచ్చాలాటో ఆడుకుంటూ ఉంటారు. బడి వదిలే సమయానికి మిగతా పిల్లలకు కాస్త ముందూ వెనకో ఇళ్లకు చేరుకుంటారు. ఇంట్లో కూడా వాళ్ళనెవరూ పట్టించుకోరు.

వెంకట్రావు, జీవన్, డేవిడ్ వీళ్ల పార్టీ మంచిది కాదు. ఎప్పుడూ బడి, చదువు. ఇవి తప్ప మరో ధ్యాస వాళ్లకుండదు. పొరపాటున పలకరిస్తే చాలు. "ఏడో ఎక్కం వచ్చా, పన్నెండో ఎక్కం వచ్చా, పదహారో ఎక్కం వచ్చా?" అని అడుగుతుంటారు. బోడి ఎక్కాలు వీళ్లకే వచ్చినట్లు. చదువు కట్టిపెట్టి ఎంచక్కా ఆడుకుందామని వాళ్లకు తెలీదు. ఈ జీవన్‌గాడయితే మరీనూ, వాడికి పంధొమ్మిదో ఎక్కం కూడా వచ్చు. ఇంగ్లీషు కూడా నేర్చుకుంటున్నాడు. ముచ్చు ముఖం వాడూనూ. వాడిని చూస్తుంటే తనకు చిర్రెత్తుకొస్తుంటుంది.

మాస్టారును చూస్తుంటే తనకు కోపం వస్తుంటుంది. ఆ పాఠం చదివావా, ఈ పాఠం చదివావా, ఎందుకు చదవలేదు, బెంచి ఎక్కి నిలబడు. గోడకుర్చీ వేయి అని అరుస్తూ పేంబెత్తం తీసుకుంటాడేగాని నీకు గోలీలాట వచ్చా, బిళ్ళంగోడు వచ్చా? గాలిపటానికి ఎంత తోక ఉండాలి. దారానికి ఏ మాంజా ఎలా పూయాలి. తూనీగల్ని ఎలా పట్టాలి – ఇటువంటి ప్రశ్నలు వేయనేవేయడు. చిన్నప్పుడు ఆయన ఇవిచేయలేదా, ఆటలు ఆడుకోలేదా?

"నిన్న నేనో పిచ్చుకను పట్టానురా నానీ" అన్నాడు మస్తాన్.

నాని బడి ఆలోచనల్లోంచి బయటకొచ్చి "ఎలా పట్టావురా?" ఆశ్చర్యపోతూ అడిగాడు. పిచ్చుకల్ని పట్టాలని తను చాలాసార్లు ప్రయత్నం చేశాడు కాని వీలుకాలేదు.

మస్తాన్ తను ఆ పిచ్చుకను ఎలా పట్టిందీ, అదెంత అందంగా ఉందో చెబుతోంటే నానికి మస్తాన్‌మీద అసూయ కలిగింది. దాని గురించి అంతా విన్నాక, "దాన్ని నాకివ్వవురా?" అడిగాడు నాని.

బాబ్జీ మధ్యలో కల్పించుకుని, "నేను అడిగితేనే ఇవ్వనన్నాడు. కదరా మస్తానూ?" అన్నాడు.

"అరె మస్తానూ, మరో పావలా తీసుకొచ్చిస్తాను. దాన్ని నాకివ్వరా."

"మరో పావలాకాదు కదా, నెహ్రూ అర్ధరూపాయి ఇచ్చినా నేనివ్వను" అన్నాడు మస్తాన్ కుండబద్దలు కొట్టినట్లు.

"అంతేనా మస్తానూ?" నసిగాడు నాని.

"ఇంకోసారి అడిగితే నీవీపుమీద పెసరట్టు వేస్తాను."

వాళ్ళు అబద్ధం చెబుతున్నట్లనిపించింది నానికి.

ముగ్గురూ మలుపు తిరిగి స్టేషన్ రోడ్డుమీది కొచ్చారు. తాము ఏ రోడ్డుమీది కొచ్చామో తెలిసాక నాని కాళ్లు తడబడ్డాయి. కుడి పక్కకు వెళ్తే బడి వస్తుంది. బడికి వెళ్తే ఎక్కాలు అప్పచెప్పాలి. పాఠం, పద్యాలు చెప్పాలి. చేసిన హోంవర్క్ చూపించాలి. ఇవేం చేయలేదు కాబట్టి దజను బెత్తం దెబ్బలుతిని, గుంజిళ్లు తీసి గోడకుర్చీ వేయాలి. ఎవడు పడ్తాడీ బాధలు? అందుకే నిన్న అన్నాడు, "నేను మీ పార్టీలో చేరి ఆడుకోటానికి వస్తాను" అని, పావలా ఇస్తేగాని తనను చేర్చుకోనన్నారు. ఒప్పుకుని ఇచ్చుకోకతప్పలేదు.

బడికి వెళ్తున్న పిల్లలు ఎదురవుతున్నారు. బాబ్జీ నిన్న సాయంత్రం గాలిపటం ఎలా తయారుచేసిందీ చెబుతున్నాడు. నాని'ఊ' కొడుతున్నాడు కాని మనసు బాబ్జీ మాటల మీదలేదు. తన క్లాసు పిల్లలు ఎవరయినా కనిపిస్తారేమోనని భయంగా ఉంది. కనిపిస్తే తను మస్తాన్‌తో, బాబ్జీతో తిరుగుతున్న సంగతి క్లాసు మాస్టారుకి తప్పకుండా చెబుతారు. చొక్కా కాలరు పైకి లాక్కుని తల వంచుకుని మస్తాన్ పక్కగా నడుస్తూ ఎదురయ్యే పిల్లలను ఓరగా చూడసాగాడు.

నాని భయపడినంతా అయింది. జీవన్ ఎదురయ్యే సరికి ఎలా తప్పించుకోవాలో అర్థం కాలేదు.

జీవన్ నాని దగ్గిరగా వచ్చి, "బడి దొంగ, ఉండు. నీ గురించి మాస్టారుకు చెప్తాను" అన్నాడు.

నాని తలెత్తి మస్తాన్ వంక చూశాడు. గుండె వేగంగా కొట్టుకుంటోంది.

"చెప్పావంటే మక్కెలు విరిగేలా తంతాను" అన్నాడు మస్తాన్.

మస్తాన్ అవతారం చూసి జీవన్ రెండడుగులు వెనక్కి వేశాడు. నానికి ఎక్కడలేని ధైర్యం వచ్చింది."నేను బడికి రానే రాను పోరా" అన్నాడు కోపంగా.

కొద్దిదూరం వెళ్లాక "అరే నానీ! నీ గురించి మాస్టారుకు చెప్పక పోతే నా పేరు జీవన్ కాదు" అని పరుగు లంకించుకున్నాడు.

బాబ్జీ రాయి అందుకుని, "చెప్పావో నీ తలకు బొక్కపడిందే" అని జీవన్ వైపు విసిరాడు. జీవన్ అప్పటికే మలుపు తిరిగాడు.

ముగ్గురూ ముందుకు నడవసాగారు. నానిలో ఇందాక తగ్గిన భయం తిరిగి ఎక్కువ కాసాగింది. జీవన్ గాడు ఊరుకోడు. తను బడి ఎగ్గొట్టి వీళ్లతో తిరుగుతున్న సంగతి తప్పకుండా మాస్టారుకు చెబుతాడు. మాస్టారు ఇంటికొచ్చుల్లా నాన్నకు చెబుతాడు. నాన్న నాలుగు ఉతికి సాయంత్రం అన్నం పెట్టొద్దని అమ్మకు చెబుతాడు. తను ఫినిష్. చెప్పకురా అని జీవన్‌గాడిని బతిమిలాడినా బావుండేదేమో. మర్రిచెట్టు కిందకు చేరి గోలీలాట ఆడారు. మస్తాన్‌కి బాబ్జీకి గోలీలాట బాగా వచ్చు. నానికి అంతంతమాత్రంగా వచ్చు. నాని దగ్గిరున్న మామూలు గోలీలు ఏడు, సీసంగోలీలు రెండు మస్తాన్ గెల్చుకున్నాడు. అన్ని గోలీల్లో సీసం గోలీలంటే నానికి చాలా ఇష్టం. సంవత్సరం నుండి ఎవరికీ ఇవ్వకుండా దాచుకున్నాడు. అన్ని గోలీలు మస్తాన్‌కి ఇస్తుంటే మనసు అదోలా అయిపోయింది. దుఃఖం ఒక్కటే తక్కువ. ఆ గోలీలు మస్తాన్‌కి ఇవ్వకుండా

పారిపోదామని కూడా అనిపించింది. పారిపోయినా మరుసటిరోజు పట్టుకుని తంతాడని భయం వేసింది. దుఃఖాన్ని దిగమింగుకుని వాళ్లిద్దరు ఆడుతోంటే చూడసాగాడు.

కొద్దిసేపు చూసేసరికి విసుగుపుట్టింది. తొందరపడి వీళ్లతో వచ్చానేమో అనిపించింది. ఇద్దరూ ఆటలో పూర్తిగా మునిగిపోయారు. పిలిచినా పలికేట్టు లేరు. ఇంటికి వెళ్లిపోదామనిపిస్తోంది. వాళ్ళను చూస్తున్న కొద్దీ కోపం ముంచుకువస్తోంది. తనేగాని మాస్టారంత ఎత్తుగా ఉండుంటే వీళ్ళిద్దరినీ చితక తన్నేసేవాడిని అనుకుని చెట్టు వెనకకు వచ్చాడు.

అక్కడ బండకానుకుని సైకిలు రిక్షా ఉంది. రిక్షాలో రిక్షావాడు కాళ్లు ముడుచుకుని నిద్రపోతున్నాడు. నాని బండమీద కూర్చున్నాడు. సూర్యకిరణాలు ఆకుల మధ్యలోంచి రిక్షా బెల్‌మీద పడుతూ వెలుగుతూ కదులుతున్నాయి. బెల్ కొత్తగా ఉంది.బండ దిగి రిక్షా దగ్గిరకొచ్చి రిక్షా వాడి ముఖం చూస్తూ బెల్ మోగించేసరికి రిక్షావాడు ఉలిక్కిపడి నిద్రలేచి కూర్చునేసరికి బెల్ ముట్టుకుని మోగించినందుకు తనను తిడతాడేమోనని భయం వేసి చటుక్కున చేయి వెనక్కి పెట్టుకున్నాడు. రిక్షావాడు చిన్నగా నవ్వి జేబులోంచి బీడీ తీసి వెలిగించాడు. రిక్షాకు ఆనుకుని నిలబడి రిక్షావాడి ముక్కులోంచి వస్తున్న పొగవంక చూస్తూ తనూ పెద్దయ్యాక ఎంచక్కా సిగరెట్లు కాల్చవచ్చు అనుకున్నాడు.

"సదూకుంటుండావా?" అడిగాడు రిక్షావాడు.

తలూపాడు నాని.

"ఎన్నో కిలాసు?"

"అయిదు."

"ఇయ్యాళ ఇస్కూలు లేదా?"

"ఉంది."

"ఎళ్ళలేదేం?"

"వెళ్ళలేదు."

"ఆ ఇద్దరెవరు?"

"మా క్లాసు పిల్లలు."

"ఆళ్ళతో నువ్వాడడం లేదే?"

"నా గోలీలు అన్నీ వాళ్లే గెల్చుకున్నారు."

చివరంటా కాలిన బీడీ దూరంగా విసిరి రిక్షా దిగి, "సుబ్బరంగా ఇస్కూలు కెళ్లక ఎందుకంట ఆటలు?" అన్నాడు రిక్షావాడు.

ఏమని జవాబు చెప్పాలో నానికి అర్థం కాలేదు.

"నేనూ అయిదో కిలాసు వరకు సదూకున్నా."

"ఆరు చదవలేదా?"

"లే, సదవలే. ఏడ? అప్పుడూ నేను ఇట్టాగే బడి ఎగ నూకి గోలీలనీ, బిళ్ళంగోడనీ, ఓహ్... శానా ఆటలు ఆడేవోణ్ణి. సరింగ బడికెళ్లి సదూకోరా అని మా అయ్య నెత్తీనోరూ బాదుకునేవాడు. ఇనిపించుకుంటేనా? మా అయ్య మాటలు ఇనుంటే ఇప్పుడీ ఎదవరిచ్చా లాగే కరమం ఎందుకు పట్టేది? ఇస్కూలు ఎళ్ళలేదు. సెడిపోయా. సదూకునుంటే మంచి ఉద్దేగమే దొరికుండేది" అన్నాడు.

అరగంట తర్వాత, ఆటకట్టి పెట్టి మస్తాన్, బాబ్జి నాని కోసం వెదుకుతున్న సమయానికి నాని బడిలో గోడకుర్చీ వేసి పన్నెండో ఎక్కం కంఠతా పెడుతున్నాడు.

◆ ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక 2 ఫిబ్రవరి 1968